# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 127 | విశాఖపట్నం | 7-2-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-
Volume : 01 | Issue : 127 | VISAKHAPATNAM | 7-2-2026 SATURDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-


Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...
ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు
సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
9516171797, 9491286902

## పొలాల నుంచి ఇంట్లోకి చొరబడిన పెద్దపులి..
### భయాందోళనలో గ్రామస్థులు

2లో

## పెద్ద పేగు క్యాన్సర్ ఉంటే ఆరంభంలో కనిపించే లక్షణాలు..



6లో



## లోక్‌సభలో గందరగోళం.. సోమవారానికి వాయిదా!

2లో

### పాస్‌బుక్‌లు ట్యాంపర్ చేస్తే
# జైలుకు పంపిస్తాం: చంద్రబాబు

**కర్నూలు, పతాకం న్యూస్:** జీవితంలో ఎవరూ మీ భూమి మీద కన్ను వేయకుండా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. క్యూ ఆర్ కోడ్ వల్ల సెల్ ఫోన్‌లో మీ భూమి మీకు కనిపిస్తుందని వివరించారు. తాను నాలుగో సారి ముఖ్యమంత్రిని అ య్యానని.. ఇప్పటి వరకు తన జీవితంలో ఇన్ని భూ సమస్యలు గతంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ ముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతు కరోనా సమయంలో సైతం పని చేశారని గుర్తు చేశారు. ఏపీలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది తన సంకల్పమని స్పష్టం చేశారు. టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు చంద్రబాబు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. ఓర్వకల్లును తాను అభివృద్ధి చేస్తే.. వాళ్లు సర్వనాశనం చేశారన్నారు. అయినా.. మీ వారసత్వ భూమిపై వైఎస్ జగన్ ఫొటో ఏమిటని రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకే రాజముద్రతో కొత్త పుస్తకాలు ఇచ్చి.. మీకు మళ్లీ హక్కు కల్పించానని వివరించారు. మీ జుట్టు జగన్ తన చేతుల్లో పెట్టుకుని పాలించాడని విమర్శించారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లితే.. ఆయన ఫొటో చూడాలి.. పొలానికి వెళ్లితే ఆయన ఫొటో చూడాలనే విధంగా వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ దుర్మార్గుడి ఫొటో చూడాల్సిన పని ప్రజలకు ఏముందని ఆయన ప్రశ్నించారు. నూటికి 80 శాతం భూ సమస్యలు వస్తున్నాయని విమర్శించారు. లక్ష ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల రికార్డుల్లో పెట్టారని మండిపడ్డారు. తాడేపల్లె సమీపంలో 10 ఎకరాల ప్రైవేట్ భూమిని హెలిప్యాడ్‌గా మార్చుకున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్



ఆగడాలను ఈ సందర్భంగా ఎండగట్టారు. 70 ఏళ్ల రికార్డున్న ఆ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులు మార్చారని తెలిపారు. రాజకీయ లబ్ధి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమాలు, దుర్మార్గాలు చేశారని వైసీపీ అగ్రనేతల ఆగడాలను సీఎం చంద్రబాబు బహిర్గతం చేశారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎవరైనా మీ భూమిపై కన్నేస్తే జైలుకి వెళ్తారని స్పష్టం చేశారు. ఏ ఒక్క తప్పు ఉన్నా ఆ పట్టాదారు పుస్తకం చించేసి.. సరి చేసి ఇంకో పుస్తకం ఇస్తామని వివరించారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలని ఉద్దేశ్యంతో ఈ విధానాన్ని తీసుకుని వచ్చామన్నారు. మీకు కాల్ చేసి.. వివరాలు తీసుకుని మార్పులు (తరువాయి 2వ పేజీలో)

### మలివిడత భూసమీకరణపై సమావేశాలు
# నిర్వహిస్తాం : నారాయణ




**తుళ్లూరు, పతాకం న్యూస్:** మలివిడత భూసమీకరణపై సమావేశాలు నిర్వహిస్తామని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. రాజధానిలో మంత్రుల బంగ్లాల నిర్మాణ పనులు, జీఏడీ టవర్ డయాగ్రిడ్ ఫ్యాబ్రికేషన్ పనుల పురోగతిని మంత్రి శుక్రవారం పరిశీలించారు. తొలి విడత భూ సమీకరణ జరిగినంత వేగంగా మలివిడత భూ సమీకరణలో భూములు ఇచ్చేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేయడం లేదని జరుగుతున్న ప్రచారాన్ని విలేకరులు ప్రస్తావించగా.. మంత్రి స్పందించారు. అలాంటిదేమీ లేదని, మొదటి విడత భూసమీకరణ అనుభవాల దృష్ట్యా తొందర పడకుండా ముందుకెళుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నియోజక వర్గంలోని కొన్ని గ్రామాల్లో సమావేశాలు నిర్వహించామని, మరొక గ్రామంలో జరపాల్సి ఉందని అన్నారు. మరో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ప్రాతినిధ్యం వహించే గ్రామాలలో కూడా సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. మలివిడత భూసమీకరణలో (తరువాయి 2వ పేజీలో)

# జగన్‌పై డోలా ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ విజయవాడ పర్యటనపై కీలక వ్యాఖ్యలు చేశారాయన. జగన్ పర్యటనకు తామెప్పుడూ ఆటంకం కలిగించమని స్పష్టం చేశారు. శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమా నికి మంత్రి వీరాంజనేయ స్వామి హాజరై మాట్లాడారు. జగన్ పర్యటన వల్ల ప్రజలకు ఇబ్బంది ఉండకూడదని మంత్రి చెప్పుకొచ్చారు. మాజీ సీఎం పర్యటన వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వంపై బురదజల్లితే చూస్తు ఊరుకోమని హెచ్చరించిన ఆయన.. జగన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎక్కువసేపు ఆపించద్దని సీఎం చంద్రబాబు తమను ఆదేశించారని.. ప్రజల సౌఖ్యమే మనకు కావాలని చెబుతారని మంత్రి ప్రస్తావించారు. జగన్ పెళ్లిళ్లు, ఫంక్షన్ల వద్ద కూడా తమ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ తన బుద్ధి మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 2047 నాటికి ఇండియా అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆకాంక్షించారు. 'ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో మనం రెండో స్థానంలో ఉన్నాం. జీడీపీలో మూడో స్థానంలో చేరబోతున్నాం. మనమిత్ర, ఆదర్ సెంటర్స్, మీ సేవ వంటి టెక్నాలజీ మొత్తాన్ని మన శాఖ ద్వారా ఇంప్లిమెంటేషన్ చేస్తున్నాం. ప్రభుత్వానికి సంబంధించిన సుమారు 100 సేవలను మేము అందిస్తున్నామన్నారు.

### మీ అరాచకాన్ని నిలదీస్తే..
# దాడులు చేస్తారా?: జగన్





**విజయవాడ, పతాకం న్యూస్:** వరుసగా వైఎస్సార్సీపీ శ్రేణులపై టీడీపీ గూండాలు చేస్తున్న దాడులను వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. అక్కడ (గుంటూరులో) అంబటి రాంబాబు ఇంట్లోకి చొరబడి విధ్వంసం.. ఇక్కడ జోగి రమేష్( విజయవాడ, ఇబ్రహీంపట్నం) ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాటిళ్లతో దాడులు చేయడం కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు నిదర్శనమంటూ మండిపడ్డారు వైఎస్ జగన్. శుక్రవారం జోగి రమేష్ ఇంట్లో దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన వైఎస్ జగన్.. ఆపై కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం, వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. 'అంబటి రాంబాబు ఇంట్లో కొనసాగించిన జంగిల్ రాజ్ పరంపరను జోగి రమేష్ విషయంలో కూడా కొనసాగించారని ధ్వజమెత్తారు. ' గుంటూరులో అంబటి రాంబాబు అన్న ఇంటిని..ఇక్కడ జోగి రమేష్ ఇంటిని ధ్వంసం చేశారు. అంబటి రాంబాబు ఇంట్లోకి చొరబడ్డారు.. విధ్వంసం సృష్టించారు. అంబటి కుటుంబ సభ్యులపై దుర్భాషలాడారు. పక్కనున్న అంబటి ఆఫీస్ ను కూడా తగలబెట్టారు. అంబటి ఇంట్లో, ఆఫీస్ లో జరిగిన జంగిల్ రాజు.. జోగి రమేష్ విషయంలో కూడా కొనసాగించారు. చంద్రబాబు అబద్ధాలను సీబీఐయే తేటతెల్లం చేసింది. తిరుమల లడ్డూలో ఎటువంటి కల్తీ జరగలేదని సీబీఐ స్పష్టం చేసింది. జంతువుల కొవ్వు కానీ, గొడ్డు మాంసం కానీ ఎటువంటి పంది (తరువాయి 2వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### ప్రక్షాళన

అగ్నికి ఆజ్యం పోయడం అనేది తెలుగులో సామెత. అంటే మంటలో నెయ్యి పోస్తే మరింత ఎక్కువగా మండుతుందన్న ఆ సామెత ఇప్పుడు తిరుపతి లడ్డూ వివాదానికి అక్షరాలా సరిపోతుంది. సుప్రీం కోర్టు జోక్యంతో సిబిఐ ఈ కేసు దర్యాప్తు చేపట్టి విచారణ జరుపుతున్న నెల్లూరు ఎసిబి కోర్టులో అభియోగపత్రం అనుబంధ పత్రం కూడా దాఖలు చేసింది. ఇప్పుడు జరగాల్సింది సిబిఐ నిర్ధారణలపై తక్షణ ప్రక్షాళన చర్యలు తీసుకోవడం. తర్వాత కోర్టు విచారణ. ఈ ప్రక్రియపైనే ఏమైనా అభ్యంతరాలుంటే పై కోర్టుకు వెళ్లడం. ఇది పద్ధతి. కానీ మంగళవారం సమావేశమైన ఎ.పి కూటమి మంత్రివర్గ సమావేశం సిబిఐ సిట్ నివేదికపై మరో కమిటీని నియమించాలని నిర్ణయించింది. ఈ కమిటీ తక్షణ పాలనా చర్యలకోసం అని కొన్ని పత్రికలు రాస్తే విచారణ కమిషన్ అని మరికొన్ని రాశాయి. మాజీ ఇవోలు ధర్మారెడ్డి, అనిల్ సింఘాల్ పైన ప్రధాన అకౌంట్స్ అధికారి పైన చర్య తీసుకోవాలని సిట్ ఇప్పటికే లేఖ రాసింది. సింఘాల్‌ను తప్పించారు కూడా. అత్యున్నత స్థాయిలో విచారణ దర్యాప్తు జరుగుతున్నప్పుడు మరో కమిటీ మధ్యలో ఎలా తల దూరుస్తుందనేది చాలామంది సందేహం. కనుక సమగ్ర న్యాయ విచారణ జరపడం తప్ప మరో కమిటీతో అవుతుందా? సిబిఐ నివేదికలో జరిగిన తప్పులను, బాధ్యులను గురించి నివేదించినా అసలైన సూత్రధారులను పేర్కొనలేదని మంత్రులు ఈ సందర్భంగా చెబుతున్నారు. ఫలానా వారు లేరని కూడా వారన్నారు. నిస్సందేహంగా రెండు ప్రభుత్వాల హయాంలోనూ తప్పులు చేసిన వారున్నారు. వ్యవస్థాగత లోపాలూ వున్నాయి. సిబిఐ సిట్ నివేదికలో కొవ్వు లేదని చెప్పడంతో పాటు కల్తీ తీవ్రస్థాయిలో వుందని తేలింది. ఇందులో వైసిపి గాని కూటమి గాని తమకు కావలసిన భాగాలనే చెబుతున్నాయి. తమ వాదన పదునుగా వినపడలేదని, దాడి పెంచాలని కూటమి వ్యూహంగా వుంటే అసలు కల్తీ చర్చనే లేకుండా చేయాలని వైసిపి నేతల ఆలోచనగా కనిపిస్తుంది. ఇప్పుడు కొత్తగా కాస్త అటూ ఇటూ అయితే మళ్లీ కోర్టుకు వెళతారు, మరిన్ని ఫిర్యాదులు చేస్తారు కదా..? ఆ తంతు మొదలైపోయింది కూడా. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ ఈ మధ్య రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓ ట్రిప్వేశారు. వివిధ వర్గాల ప్రముఖులు, వాణిజ్యవేత్తలు, అనుకూల భావుకులు కలుసుకున్నారు. ఆయన షరామామూలుగా తన సందేశం తానిచ్చారు. అయితే ఈ భేటీలలో అందరినీ ఆకర్షించింది తెలుగు సినీ ప్రముఖులతో భగవత్ భేటీ. హీరో వెంకటేశ్ నివాసంలో ఆయన జరిపిన ఈ భేటీకి అక్కినేని నాగార్జున, నానీ, రామ్ పోతినేని, త్రివిక్రమ్ శ్రీనివాస్, తాజా హిట్‌తో వున్న అనిల్ రావిపూడి, దగ్గుబాటి సురేష్, వరుణ్ తేజ్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్, రవిశంకర్ ఇత్యాదులు హాజరయ్యారట. మెగా ఫ్యామిలీలో చిరంజీవి రాజకీయాలకు దూరమని చెబుతున్నా వారందరూ సహజంగా మోడీ పరివార్‌కు దగ్గరగానే వున్నారు. అభిషేక్ అగర్వాల్ గతంలో 'కార్తికేయ 2, కాశ్మీర్ ఫైల్స్, ది వాక్సిన్ వార్' వంటి రాజకీయ చిత్రాలు తీశారు కూడా. తెలుగు సినిమా 'రజాకార్' కూడా ఈ కోవలో వచ్చిందే. చాలా ఏళ్ల కిందటనే నాగార్జున తన 'రామదాసు' చిత్రాన్ని హిందీలో అనువదించినప్పుడు అద్వానీతో ఆవిష్కరింపచేశారు. రాజమౌళి తండ్రి, కథకుడు విజయేంద్ర ప్రసాద్‌ను కేంద్రం రాజ్యసభకు పంపింది. కొంతకాలం కిందట హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా హైదరాబాద్ వచ్చి జూనియర్ ఎన్టీఆర్‌ను కలుసుకుని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత హెడ్గేవార్ బయోపిక్‌లో నటించాలని కోరారని ఒక కథనం. ఇప్పుడు వందేళ్ల ఆర్‌ఎస్‌ఎస్ పై తీసిన సినిమా 'శతక్' విడుదల గురించి మాట్లాడేందుకే ఆయన వచ్చారని ఒక కథనం. ఏమైనా మోహన్ భగవత్ తెలుగు సినిమాలలో సనాతన భారతీయ సంస్కృతిని చూపించాల్సిన అవసరాన్ని గురించి ముచ్చటించారట. హీరోలు విప్లవకర సంభాషణలు చేయడం అలవాటైన తెలుగు సినిమాల దిశను మార్చే ప్రయత్నం తీవ్రంగానే జరుగుతుంది మరి. ఇప్పటికే ఆ ధోరణి తగ్గింది. మహేష్‌బాబు లాంటి హీరో ఏ సందర్భం లేకుండా ఆర్‌ఎస్‌ఎస్ తరహా కర్రలు పట్టుకుని రాముణ్ణయినా కృష్ణున్నయినా...అని పాడటం, బృంద గీతాల్లో కాషాయ నేపథ్యం, సంచారం చూపించడం యాదృచ్ఛికం కాదన్నమాట. ఏదైనా తెలుగుసీమలో తిష్ట వేయాలనే తాపత్రయాన్నే ఇవి చెబుతున్నాయి. లేకుంటే మునిసిపల్ ఎన్నికల కోసం బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ వచ్చి సభలు పెడతారా? దేశంలోనే అత్యున్నత చట్టసభ పార్లమెంటు. మోడీ హయాంలో మరీ ముఖ్యంగా రెండోసారీ మూడోసారీ గెలిచాక అక్కడ చర్చల కన్నా దాటవేతలూ, నోరు నొక్కడాలు మామూలైపోయాయి. నోట్ల రద్దు, 370 రద్దు, వ్యవసాయ చట్టాలు, సర్, జమిలి వంటి వాటిపైనే చర్చ లేకుండా పోయింది. అసలు పార్లమెంటు భవన పునర్నిర్మాణం, సెంగాల్ తెచ్చి పెట్టడం వంటివి కూడా పెద్ద చర్చ వివరణ లేకుండానే జరిగిపోయాయి. ఇప్పుడు విదేశీ వ్యవహారాలు, దేశ రక్షణ కూడా ఆ జాబితాలో చేరుతున్నాయా? చైనాతో గాల్వన్ తర్వాత డోక్లాం ఘర్షణ వంటివి 2020లో హోరెత్తిపోయాయి. చైనా, ఇండియా రెండు పెద్ద దేశాలుగా ప్రశాంతంగా వుండాలని చెప్పేవారిని అపహాస్యం చేస్తూ తామే దేశభక్తులమని ఊగిపోయింది పరివార్.

## లోక్‌సభలో గందరగోళం.. సోమవారానికి వాయిదా..!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో సభ సోమవారానికి వాయిదా పడింది. గురువారం ప్రధాని మోడీ రాజ్యసభలో చేసిన విమర్శలపై ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. లోక్‌సభలో రాహుల్‌గాంధీని ఎందుకు మాట్లాడనివ్వడం లేదని వారు ప్రశ్నించారు. ఈరోజు సభ ప్రారంభం అయిన కొద్ది నిమిషాలనే 12 గంటలకు వాయిదా పడింది. ప్రతిపక్ష ఎంపీలు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు. పలువురు సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతిపక్ష సభ్యులకు స్పీకర్ ఓంబిర్లా నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినిపించుకోలేదు. దీంతో స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో ఈ బడ్జెట్ సెషన్‌లో ఇప్పటికే 19 గంటల 13 నిమిషాల సమయం వృథా అయ్యిందని స్పీకర్ తెలిపారు. కాగా పార్లమెంట్‌లో తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13తో ముగియనున్నాయి. మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 9 నుంచి లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ జరుగనుంది.

## మనకెందుకులే అనుకోవద్దు... ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుంది: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.

## దాడులు చేస్తారా?: జగన్

(మొదటిపేజీ తరువాయి)

కొవ్వు కలపలేదని సీబీఐ రిపోర్ట్ పేర్కొంది. శ్రీ వెంకటేశ్వరస్వామిని అగౌరపరిచిన, అవమానపరిచిన వ్యక్తి చంద్రబాబు. ఒక అబద్ధాన్ని సృష్టించి.. దానికి రెక్కలు కట్టి మరీ దుష్ప్రచారం చేశారు. లడ్డూలో జంతువుల కొవ్వు అంటూ విష ప్రచారం చేశారు. చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు ఆడుతున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా, చంద్రబాబు హయాంలో సేకరించిన నమూలను కేంద్ర సంస్థలైన ఎన్డీడీబీకి, ఎన్డీఆర్ఎస్‌ఐకి పంపింది. ఎలాంటి కల్తీ జరగలేదని చెప్పాయి. సీబీఐ ఇంకొకటి కూడా చెప్పింది. టీటీడీ చైర్మన్లుగా పని చేసిన తమ నేతలు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్రెడ్డిలు సమయంలో ఎటువంటి తప్పు జరగలేదని సీబీఐ క్లీన్ చిట్ కూడా ఇచ్చింది. సీబీఐ ఇచ్చిన చార్జిషీట్లో.. పేజ్ నం 62లో వాళ్లు మెన్షన్ చేసింది ఏమిటంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా జూలైలో టీటీడీ వాళ్లు నాలుగు ట్యాంకర్లు రిజెక్ట్ చేశారు. అవే ట్యాంకర్లను దొడ్డిదారిని మళ్లీ టీటీడీకి రప్పించి, వాటినే వాడారని సీబీఐ చెప్పింది. మరి ఇప్పుడు పాపం చేసింది ఎవరు అనేది ప్రశ్నిస్తున్న చంద్రబాబుని. కూటమి నేతల్ని కూడా ప్రశ్నిస్తున్న తప్పు ఎవరు చేశారు? పాపం ఎవరు చేశారు? అని, జంతువుల కొవ్వు ఉందని గొడ్డుమాంసం ఉందని ఏ ల్యాబ్ రిపోర్టు చెప్పాయి. ఎవరూ చెప్పలేదు. అది చంద్రబాబు సృష్టి. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబే సృష్టించారు' అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత జగన్ ఇబ్రహీంపట్నం పర్యటన సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జోగి రమేశ్ ను పరామర్శించేందుకు ఆయన తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నంకు బయల్దేరారు. ఈ క్రమంలో జోగి రమేశ్ ఇంటి సమీపంలో వైసీపీ నేత మృతి చెందారు. జగన్ వస్తున్న నేపథ్యంలో జోగి రమేశ్ ఇంటికి వెళుతున్న చిల్లకల్లు గ్రామ వైసీపీ అధ్యక్షుడు డి.రాంబాబు పల్స్ పడిపోయి కుప్పకూలారు. వెంటనే ఆయనను సమీప ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు కాసేపటి క్రితం జోగి రమేశ్ ఇంటికి జగన్ చేరుకున్నారు. ఆయన ఇంటిని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగన్ పర్యటన సందర్భంగా ఓ కుర్రాడు కూడా మరణించినట్టు తెలుస్తోంది. బైక్ పై విన్యాసాలు చేస్తూ బార్ గేట్ ను ఢీకొనడంతో అతడు మృత్యువాతపడినట్టు సమాచారం. మృతిచెందిన కుర్రాడిని ఇబ్రహీంపట్నంకు చెందిన భార్గవ్ గా గుర్తించారు.

## పొలాల నుంచి ఇంట్లోకి చొరబడిన పెద్దపులి.. భయాందోళనలో గ్రామస్థులు



**తూర్పుగోదావరి జిల్లా, పతాకం న్యూస్:** తూర్పుగోదావరి జిల్లాలో పెద్దపులి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం రాయవరం మండలం కూర్మాపురంలో పాడుబడిన ఇంట్లో పులి గాండ్రింపులు వినిపిస్తున్నట్లు స్థానికులు చెప్పడంతో అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. తొలుత అనుమానించినప్పటికీ ఆ తర్వాత పులి ఆ ఇంటిలోనే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. పులిని బంధించేందుకు నిపుణులు, అటవీశాఖ సిబ్బంది ప్రయత్నాలు చేశారు. తుపాకిలో మత్తు ఇంజక్షన్ లోడ్ చేసి పులిని షూట్ చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో అది బెదిరిపోయి పాడుబడిన ఇంటి నుంచి సమీపంలోని పొలాల్లోకి వెళ్లింది. కూర్మాపురంలో ఓ దూడను చంపి తినేసింది. పెద్ద పులి సంచారం, గాండ్రిపులతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలను పెద్దపులి బెంబేలెత్తిస్తోంది. ఎప్పటికప్పుడు మకాం మారుస్తూ జనాలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. డ్రోన్లతో గాలించినా పులి చిక్కడం లేదు. ఇప్పటివరకు పొలాలు, తోటల్లోనే కనిపించిన పులిజాడలు మొదటిసారిగా ఓ ఇంట్లో తారసపడ్డాయి. దీంతో అటవీ అధికారులు, సిబ్బందిపై గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపులి సంచారంతో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. 6 రోజుల్లో వివిధ ప్రాంతాల్లో 5 ఆవులు, ఒక గేదె, 2 దూడలను వ్యాఘ్రం చంపేసింది. దీంతో రాజమహేంద్రవరం శివారు, రాజానగరం మండల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి రాజానగరం మండలం భూపాలపట్నం పరిధిలోని పామాయిల్ తోటలో ఒక ఆవును పులి చంపింది. అక్కడి నుంచి జి.యర్రంపాలెం పరిధిలోని పామాయిల్ తోటలో మరో రెండు ఆవులను చంపడంతో పాటు ఒక దూడను సగం తిని వదిలేసింది. అటవీశాఖ అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. దానిని బంధించేందుకు రెస్క్యూ బృందం పుణె నుంచి వచ్చినట్లు వారు తెలిపారు. జి.యర్రంపాలెంలోని కృష్ణారావు కాలనీలో పులి పాదముద్రలు గుర్తించినట్లు వారు తెలియజేశారు. కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిషోర్, సీసీఎఫ్ బి.ఎన్.ఎన్.మూర్తి, డీఎఫ్‌వో ప్రభాకర్‌రావు, ఎఫ్ఆర్వో దావీదురాజు పామాయిల్ తోటల్లోకి వెళ్లి పరిశీలించారు. ప్రజలు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. గురువారం రాత్రికి జి.యర్రంపాలెం, కేశవరం మధ్యలో కొండలపై, ఓ పరిశ్రమ ప్రాంతాల్లో పులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు. పులి కడుపు నిండడంతో తోటల్లో విశ్రాంతి తీసుకునే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## జైలుకు పంపిస్తాం: చంద్రబాబు

చేస్తున్నామని తెలిపారు. 91 వేల మంది రైతులకు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. ఏపీని భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అర సెంట్ స్థలం కోసం కుటుంబంలో తగాదాలు వస్తున్నాయని చెప్పారు. రతనాల సీమ అయిన రాయలసీమ రాళ్ళ సీమగా మారిందని.. అందుకే అన్న ఎన్టీఆర్ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని సంకల్పించారని వివరించారు. రాయలసీమకు నీరు ఇచ్చిన తర్వాతే.. చెన్నైకి ఎన్టీఆర్ నీరు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. హంద్రీనీవా, తెలుగు గంగా, గాలేరు – నగరి ప్రాజెక్ట్‌లు అన్న ఎన్టీఆర్ ఇచ్చారన్నారు. అనంతపురంను ఉద్యానవనంగా మారుస్తున్నామని చెప్పారు. రాయలసీమలో ప్రస్తుతం అత్యధికంగా పంటలు పండించేలా నీరు ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో సైతం కరెంట్ ఛార్జీలు పెంచమని చెప్పారు. తాను సీమ బిడ్డనేనని.. అన్న ఎన్టీఆర్ సైతం సీమ బిడ్డేనన్నారు. వైఎస్ జగన్ ఇప్పుడు వచ్చి రాయలసీమ అంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. పోలవరానికి శనీశ్వరుడిలా అడ్డు తగిలారంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు. గోదావరి పట్టిసీమ పెట్టి.. కృష్ణా డెల్టాకు ఇచ్చే100 టీఎంసీల నీరు రాయలసీమకు మళ్లించి ఆ ప్రాంతంలో కరువును తొలగించామన్నారు. కరువు జిల్లాల్లో కియా కార్లు పరుగెత్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు. అలా సీమను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రపంచానికి రాయలసీమ హార్టికల్చర్ అవుతుందని అభివర్ణించారు. నగదు కోసం.. కమీషన్‌లకు కక్కుర్తి పడి ఎన్‌జీటీ అనుమతి లేని ప్రాజెక్ట్ తెచ్చి.. తనపై బురద జల్లాలని చూశారంటూ వైసీపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర (టీబీ) డ్యాం నీళ్లు కర్నూలు జిల్లా ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఎస్ పూర్తి చేసి.. గుండ్రేవుల కోసం పక్క రాష్ట్రాలతో మాట్లాడి ఒప్పించి నిర్మిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. వేదవతి ప్రాజెక్ట్ తానే ప్రారంభించి.. పూర్తి చేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ చుట్టూ తీవ్రవాదులు ఉండే సమయంలో.. ఆ నగరాన్ని తాను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. వారికి తాను అడ్డు తగులుతున్నానని తిరుపతిలో తనపై దాడికి దిగారని.. కానీ ఆ వెంకటేశ్వర స్వామి తనను కాపాడారన్నారు. బల ప్రదర్శన అనేది ఎన్నికలలో చూపించుకోవాలని.. మిగతా సమయంలో ప్రజా సేవ చేయాలన్నారు. రాజకీయాల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే తాట తీస్తానని వైసీపీ నేతలను సీఎం చంద్రబాబు హెచ్చరించారు. 1995లో ఉమ్మడి ఏపీ సీఎంగా తాను ఉన్నానని.. కాబట్టే ఇప్పుడు హైదరాబాద్ ,సైబరాబాద్ నగరాలు ఉన్నాయని తెలిపారు. తాను చిత్రగుప్తుడిలా అన్ని రాసుకుంటూ ఉంటానని సీఎం చంద్రబాబు చెప్పారు.

## నిర్వహిస్తాం: నారాయణ

భూములిచ్చేందుకు రైతులు సుముఖంగానే ఉన్నారని, తొందరగా భూములిస్తే అభివృద్ధి పనులు మొదలవుతాయని అన్నారు. 80 శాతం భూములిస్తేనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రైల్వే స్టేషన్ నిర్మాణానికి 1500 ఎకరాలు ఎందుకు..? అన్న మరో ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, ఎన్ని ఎకరాలనేది ఇంకా నిర్ణయించలేదని అన్నారు. రైల్వే స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ రూపకల్పన జరుగుతోందని, అవసరమైన మేరకే భూములు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాజధానిలో 350 కిమీ ట్రంక్ రోడ్లు, 1500 కిమీ లేఅవుట్ రోడ్ల నిర్మాణ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రోడ్లతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజి, డ్రింకింగ్ వాటర్, సీనరేజి లైన్‌లు, విద్యుత్ లైన్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. మార్చి నెలాఖరుకు ప్రభుత్వ అధికారుల భవనాల నిర్మాణాలు పూర్తి చేస్తాం..మొత్తం 4,026 ఇళ్ల నిర్మాణాలలో 3,500 ఇళ్లు మార్చి నెలాఖరుకు పూర్తవుతాయన్నారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ,ఎయిర్ పోర్ట్ నిర్మాణాల కోసం ఖతార్,లండన్‌లో అధ్యయనం చేశామని నారాయణ చెప్పారు.

# లూలూరు రెవెన్యూలో భూముల సర్వే అడ్డగింత



**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** బుచ్చయ్యపేట మండలంలోని లూలూరు రెవెన్యూ పరిధిలో భూముల హడావిడి సర్వేను వద్దంటూ రైతులు సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. డిఆర్డిఓ కేంద్రానికి ఆనుకొని లూలూరు భూములు ఉండడంతో రైతులలో ఆందోళన నెలకొంది. డిఆర్‌డిఓ విస్తరణలో భాగంగా భూములను ప్రభుత్వం తీసుకుంటుందన్న ఆందోళనతో రైతులు ఉన్నారు. రెవిన్యూ అధికారులు లూలూరు రెవెన్యూ పరిధిలో గల భూములను సర్వే చేస్తామంటూ బుధవారం రాత్రి రైతులకు సమాచారాన్ని ఇచ్చారు. రైతుల ల్లో ఆందోళన మరింత పెరిగింది. గ్రామసభ నిర్వహించ కుండా రైతులకు నోటీసులు ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత కొంతకాలంగా డిఆర్డిఓ విస్తరణకు వెయ్యి ఎకరాలకు పైగా భూములు సేకరించడానికి అధికారులు ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. అయితే లూలూరు రెవిన్యూ పరిధిలో సుమారు 400 ఎకరాల భూమి వుంది. ఈ భూ మిని సేకరించడానికి ఎంజాయ్మెంట్ సర్వే చేపడుతున్నట్లు ఆందోళకారుల చెందుతున్నారు. లోపూడి వీఆర్వో సుధాకర్ పలువురు సర్వేయర్లు సర్వే చేపట్టడానికి వెళుతుండగా రైతుల అడ్డుకున్నారు. దీంతో మండల తహసిల్దార్‌కు సమాచారం ఇచ్చారు. తహసిల్దార్ ఆదేశాలతో సర్వేను నిలుపుదల చేశారు. కార్యక్రమంలో రైతులు చప్పా చిట్టిబాబు, చొప్ప త్రినాధ కరణం సంతోష్ తదితర పలు రైతులు పాల్గొన్నారు.

## ఐఎఫ్ఆర్‌కు ముస్తాబు అవుతున్న విశాఖ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మరో 9 రోజుల్లో విశాఖపట్నంలో ప్రారంభం కానున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్, ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం కార్యక్రమాలకు నగరం శోభాయమానంగా తయారవుతోంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు దేశ విదేశాల నుంచి వచ్చే అతిథుల దృష్ట్యా, ప్రధాన వేదిక అయిన ఆర్కే బీచ్ రోడ్తో పాటు వారు ప్రయాణించే మార్గాలను అధికారులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నేవీ అధికారుల సూచనల మేరకు జీవీఎంసీ రూ.17.35 కోట్ల వ్యయంతో నగర సుందరీకరణ పనులు చేపట్టింది. మొత్తం 104 అభివృద్ధి పనులు ప్రారంభించగా, వాటిలో చాలా ఇప్పటికే పూర్తికాగా, మరికొన్ని తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు 74 దేశాలకు చెందిన నేవీ ఉన్నతాధికారులు, దేశవ్యాప్తంగా 274 మంది నేవీ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. బీచ్ రోడ్డులో జరిగే ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు సుమారు రెండు లక్షల మంది తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ వేడుకలు విజయవంతమైతే విశాఖపట్నంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ట ప్రపంచస్థాయిలో మరింత పెరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అతిథులు బస చేసే హోటళ్ల పరిసరాలు, ప్రయాణ మార్గాలు, కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను అందంగా అభివృద్ధి చేయాలని నేవీ అధికారులు జిల్లా యంత్రాంగాన్ని కోరారు.ఐఎఫ్ఆర్‌కు వచ్చే అతిథులు ఎయిర్‌పోర్టుతోపాటు ఐఎన్ఎస్ డేగా, ఐఎన్ఎస్ కళింగ, ఐఎన్ఎస్ సర్కార్‌లో దిగి తాము బస చేసే హోటల్ లేదా కార్యక్రమాలు జరిగే ప్రాంతానికి చేరుకుంటారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే మార్గాల్లో రూ.6.32 కోట్లతో కొత్తగా బీటీ లేయర్ పనులు పూర్తిచేశారు

## ప్రభుత్వ పథకాలపై ఆటో ప్రచారం



**వేపగుంట, పతాకం న్యూస్:**వెనుకబడిన వర్గాల హక్కులు, ప్రభుత్వ పథకాలపై దళిత, బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్‌సి) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహనకు ఆటో ప్రచార చైతన్యయాత్రను యుసిడి, మెప్మా పీడీ సరోజిని ప్రారంభించారు. ఈనెల 5 నుంచి 7 వరకు ఎఎస్‌ఆర్ కాలనీ, గాంధీ నగర్, రాజేంద్ర నగర్, ఏకలవ్య కాలనీ, గాజువాక, ప్రియదర్శిని కాలనీలలో వేస్ట్ పికర్లు, పట్టణ పేదల హక్కులు, ప్రభుత్వ సంక్షేమ, సామాజిక భద్రతా పథకాలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. వివిధ ప్రభుత్వ పథకాల అర్హతలు, దరఖాస్తు విధానాలు, హక్కులు, బాధ్యతలపై ప్రజలకు వివరించనున్నారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ నిఖిల, సిటీ కోఆర్డినేటర్లు ధనలక్ష్మి, అజరు, గురునాథ్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. , రాజకీయ నాయకులు పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## పాడేరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

**పాడేరు, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన మెడి కల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి జనవరి 31న పదవీవిరమణ చేశారు. దీంతో స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ సర్జరీ విభాగంలో హెచ్‌వోడీగా పని చేస్తున్న డాక్టర్ కె.శ్రీనివాసరావుకు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. గిరిజన ప్రాంతంలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని, రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తానని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.



## 100 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



**కె.కోటపాడు, పతాకం న్యూస్:** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 100 కిలోల గంజాయిని కె.కోటపాడు పోలీసులు సాయంత్రం స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్పెషల్ బ్రాంచి అధికారులు అందించిన సమాచారం మేరకు కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయ్, సిబ్బంది బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. సాయంత్రం కోటపాడు సమీపంలోని చల్లవారి కళ్లాల ప్రాంతంలో ఒక కారును తనిఖీ చేయగా అందులో 100 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. కారులో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన అబ్దుల్ హకీమ్, సయ్యద్ సమీర్ ఆలీలను అరెస్టు చేశామని చెప్పారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, వాహన రికార్డులను స్వాధీనం చేసుకొని సెక్షన్ 50 ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేశారన్నారు. నిందితులు హైదరాబాద్ నుంచి ఒడిశా ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లి గంజాయిని లోడు చేసుకొని తిరిగి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు విచారణలో వెల్లడైందన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు అరెస్టు కావాల్సి ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ అప్పలరాజు, ఎస్ఐ ధనుంజయ్ పాల్గొన్నారు.

## స్వతంత్ర్యనగర్ కాలనీ నివాసితులకు న్యాయం చేస్తా: గంటా



**మధురవాడ, పతాకం న్యూస్:** స్వతంత్ర్యనగర్‌లో పార్కు, దాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఏళ్ల తరబడి నివాసముంటున్న పేదలకు న్యాయమైన శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఆయా ప్రాంతాలను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2014-19లో తాను మంత్రిగా ఉన్నప్పుడు 30 మందికి ఇళ్ల పట్టాలిచ్చానన్నారు. మిగిలిన వారికి ఇళ్ల పట్టాల జారీకి అవకాశాలను పరిశీలించి నివేదించాలని జెడ్సీని ఆదేశించినట్లు తెలిపారు. ఏళ్లతరబడి నివాసముంటున్న ఆయా కాలనీల్లో విద్యుత్ ఇతరత్రా మౌలిక సదుపాయాలను కల్పించామని, వారి ఖాళీ చేయించడం సాధ్యం కానందున ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. ఆరవ వార్డులోని యోగా థీమ్ పార్కును స్థానిక అసోసియేషన్ సమర్థంగా నిర్వహిస్తోందని ప్రశంసించారు. . అదే బాటలో మిగిలిన వార్డుల్లోని జివిఎంసి పార్కుల నిర్వహణను స్థానిక అసోసియేషన్లకు అప్పగిస్తామన్నారు. జోనల్ కమిషనర్ వి. అయ్యప్పనాయుడు, ఇఇ శాంతిరాజు, ఎసిపి శాస్త్రి, కూటమి నేతలు విజరుబాబు, పిల్లా వెంకటరావు, మొల్లి లక్ష్మణరావు, గరే గుర్నాథ్, కె.అచ్యుతరావు, చెట్టిపల్లి సన్యాసిరావు, వాండ్రాసి అప్పలరాజు, దొరబాబు పాల్గొన్నారు.

## గీతం విద్యార్థులకు అక్కినేని ప్రతిభా పురస్కారం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా వివిధ కోర్సులు అభ్యసిస్తున్న ఇద్దరు గ్రామీణ ప్రాంత విద్యార్థినులు అక్కినేని అన్నపూర్ణ, అక్కినేని నాగేశ్వరరావు పేరిట ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో ఎంఎస్‌సి స్టాటిస్టిక్స్ కోర్సును అభ్యసిస్తున్న వల్లభశెట్టి లక్ష్మీవరసాహితి అత్యుత్తమ మార్కులు (8.64 సిజిపిఎ) సాధించగా, ఎంఎస్‌సి ఎలక్ట్రానిక్స్ కోర్సు అభ్యసిస్తున్న బలుసు స్వాత్విక రఖిల అత్యుత్తమ మార్కులు (8.59 సిజిపిఎ) సాధించారు. వీరి ప్రతిభను గుర్తిస్తూ రూ.32 వేల చొప్పున అక్కినేనిప్రతిభా పురస్కాలను నగదును గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా అందజేశారు. విద్యార్థుల ప్రతిభను గీతం స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిమా ఎస్.దధీచి అభినందించారు.

### ఉద్యాన పంటలు, తోటల సాగులో

## రైతులకు మరింత ప్రోత్సాహం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఉద్యాన పంటలు, తోటల సాగులో రైతులను మరింత ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. వ్యవసాయ అనుబంధ రంగాలు 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు జిల్లా అధికారులు సమాయాత్తమవుతున్నారు. పంట దిగుబడులను పెంచడంతోపాటు నాణ్యమైన ఉత్పత్తులను సాధించేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమలు చేయాల్సిన పథకాలతో ఉద్యాన శాఖ జిల్లా అధికారి రాజశేఖరం ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా జిల్లాలో రూ.13.35 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఉద్యాన పంటల సాగు చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకాన్ని విస్తరించే కార్యక్రమంలో భాగంగా ఇటీవల పలు మార్పులు చేసింది. ఇందులో భాగంగా రైతులతో పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పూల తోటలు, పుట్టగొడుగులు, తేనెటీగల పెంపక చేపట్టి, ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించనున్నది. ఇక రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) కింద జిల్లాలో కొత్తగా జీడిమామిడి, మామిడి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్స్, ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటగా కోకో, పూలు వంటి పంటలు ఈ ఏడాది 625 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 11,600 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏపీఎంఐడీసీ ద్వారా డ్రిప్ పరికరాలను రాయితీపై అందించనున్నారు. ఈ ఏడాది 30 తేనెటీగల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పుట్టగొడుగుల పెంపకం చేపట్టే రైతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, యూనిట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. ప్రయోగాత్మకంగా పరవాడ మండలంలో పుట్టగొడుగుల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మరో మూడు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు రాయితీలు అందిస్తారు. తీగజాతి కూరగాయ పంటలను సాగు చేసే రైతులకు సిమెంట్ కాంక్రీట్ స్తంభాలు, జీఐ వైర్లతో పందిళ్లు వేసుకొనేందుకు గరిష్ఠంగా 2.5 ఎకరాలకు అత్యధికంగా రూ.2.5 లక్షల వరకు రాయితీ లభిస్తుంది. అన్ని రకాల ఉద్యాన పంటల మొక్కల ధర, సేంద్రియ/ రసాయన ఎరువులకు అయ్యే ఖర్చులో 40 శాతం వరకు ప్రభుత్వాలు భరిస్తాయి. ఉద్యాన యాంత్రీకరణలో భాగంగా చిన్న, సన్నకారు, మహిళా రైతులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీపై వివిధ రకాల యంత్ర పరికరాలను అందిస్తారు. 11 హెచ్‌పీ కన్నా ఎక్కువ వున్న పవర్ టిల్లర్‌కు రూ.లక్ష నుంచి రూ.1.2 లక్షల వరకు, మినీ ట్రాక్టర్ (20 హెచ్‌పీ) రూ.1.96 లక్షల నుంచి రూ.2.45 లక్షల వరకు ఫోర్‌స్ట్రోక్ తైవాన్ స్ప్రేయర్‌కు రూ.10 వేల వరకు రాయితీ వర్తిస్తుంది. షేడ్‌నెట్, పాలీహౌస్ నిర్మాణానికి 50 శాతం వరకు రాయితీ అందుతుంది. ఉద్యాన పంటలను సాగు చేయాలనుకొనే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎ.రాజశేఖరం తెలిపారు. ఐదు ఎకరాల్లోపు భూములు వున్న రైతులు మాత్రమే అర్హులని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణకు గడువు లేదన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జెరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్టు ఫొటోతో సమీపంలోని రైతు సేవా కేంద్రం లేదా మండల ఉద్యాన, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన రైతులకు ప్రాధాన్యతాక్రమంలో ఎంపిక చేస్తామని ఆయన పేర్కొన్నారు. రాయితీ మొత్తం ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని వెల్లడించారు.

## సీపీఎం నేత అప్పలరాజు విడుదల



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రజా ఉద్యమకారుడు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు శుక్రవారం మధ్యాహ్నం విశాఖ కేంద్రకారాగారం నుంచి విడుదలయ్యారు. ఆయనకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తదితరులు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అప్పలరాజు విడుదలవుతున్న సమాచారం తెలియగానే జైలు గేటు వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని పెద్ద పెట్టున నినదించారు. ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ ప్రజల పక్షాన అప్పలరాజు అలుపెరగని పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అయనపై పీడీ యాక్టు బనాయించి డిసెంబర్ 24న జైలుకు పంపించింది. అప్పటి నుంచి అప్పలరాజును విడుదల చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

## ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి

**ఎస్.రాయవరం, పతాకం న్యూస్:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని, ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.600 కూలి వేతనం చెల్లించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో డీఏఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పేద కూలీల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. కూలీల వేతనాలు పెంచకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం పేదలకు జీవనాధారమని, అలాంటి చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు స్పందించకపోతే ఉద్యమాలను మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, మనబాల రాజేష్ నాయకులు మహేష్, నవీన్ , మాధవ్, అప్పలరాజు, కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## రైతుల ముంగిట్లో డ్రోన్ సేవలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించాలని, ఇందులో భాగంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు చల్లడానికి డ్రోన్ల వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఆశాదేవి పిలుపునిచ్చారు. జిల్లాలోని 19 మండలాల్లో 20 కిసాన్ డ్రోన్‌లు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఐదుగురు రైతులను ఒక గ్రూపుగా ఏర్పరచి, వారిలో ఒకరిని పైలట్‌గా ఎంపిక చేసి 12 రోజుల శిక్షణ ఇచ్చామన్నారు. డ్రోన్ మార్ట్ అనే ప్రత్యేక యాప్ ద్వారా రైతులు క్యాబ్ తరహాలో డ్రోన్‌లను బుక్ చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి 'ఊబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రైతులు తమ ఫోన్ నంబరు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు ఉన్న లొకేషన్ ఆధారంగా సమీపంలో వున్న డ్రోన్‌లకు యాప్ చూపిస్తుందన్నారు. దీని ఆధారంగా రైతు డ్రోన్‌ను బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సర్వీస్ ప్రొవైడర్‌గా డ్రోన్ గ్రూప్ వారు రైతుల అభ్యర్ధనను స్వీకరించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు చల్లుతారని పేర్కొన్నారు. ఎక్కువ మంది రైతులు పురుగు మందు చల్లేందుకు డ్రోన్‌లను వినియోగిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.. డ్రోన్ సాయంతో కేవలం 10 నిమిషాల్లోనే ఎకరా విస్తీర్ణంలో ఎరువు, పురుగు మందును చల్లే అవకాశం ఉందన్నారు. డ్రోన్ నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు అద్దె వసూలు చేస్తారని తెలిపారు.

## ఎట్టకేలకు గేటువలస- కోనాపురం రోడ్డుకు మోక్షం



**అనంతగిరి, పతాకం న్యూస్:** ఎట్టకేలకు గేటువలస- కోనాపురం రహదారికి మోక్షం కలిగింది. మండలంలోని బొర్రా గేటువలస నుంచి కోనాపురం వరకు రహదారి పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. దీంతో 20 గ్రామాల ప్రజల రవాణా కష్టాలు తీరనున్నాయి. అనంతగిరి, అరకులోయ మండలాల సరిహద్దు గ్రామాలను కలుపుతూ 15 ఏళ్ల క్రితం బొర్రా నుంచి కోనాపురం మీదుగా లోతేరు, ఇరగాయి వరకు రహదారి నిర్మించారు. దీంతో సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉండేది. అయితే ఆ తరువాత నిర్వహణ లేకపోవడం, భారీ వర్షాల కారణంగా దారి పొడవునా గోతులు ఏర్పడ్డాయి. సుమారు ఎనిమిదేళ్లుగా ఈ మార్గంలో రాకపోకలు సాగించడం దుర్లభంగా మారింది. ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. బొర్రా గేటువలస నుంచి కోనాపురం వరకు 5.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు పనులకు సంబంధించి రెండు రోజుల క్రితం పరిపాలన ఆమోదం తెలిపింది. కాగా టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని పీఆర్ ప్రాజెక్ట్స్ ఏఈ గణేశ్ తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వానికి 20 గ్రామాల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని కోనాపురం సర్పంచ్ గుబాయి అప్పలమ్మ అన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడం ఆనందంగా ఉందని, అయితే నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని అధికారులు చర్యలు తీసుకోవాలని అనంతగిరి ఎంపీపీ తడబారికి మితుల కోరారు.

## వీబీజీ రామ్‌జీ పథకాన్ని రద్దు చేయాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** వీబీజీ రామ్‌జీ పథకం రద్దుచేసి, ఉపాధి హామీ పథకం యథాతథంగా కొనసాగించాలని సీపీఎం నాయకులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సంగారు గుణవతి, గార గుణవతి, భాగ్యం, హేమలత, తామాడ ఇందిరమ్మ పాల్గొన్నారు. ఉపాధిహామీ పథకాన్ని యథా విధిగా కొనసాగించాలని సీపీఎం టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో శ్రీకాకుళం మం డలపరిషత్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏపీవో కె.సీతారాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.లలిత, ఎ.లక్ష్మి, కె.అప్పారావు, ఎ.సోమశేఖర్, ఎల్.మహేష్, బి.సింహాచలం, డి.సూరి, బి.కిరణ్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## భూ వివాద కేసులను పరిష్కరించాలి

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** : భూవివాద కేసులను రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి ఆయన ఆర్డీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులతో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పోలీసుస్టేషన్ల వారీగా భూ వివాద కేసులను కలెక్టర్ తెలుసుకున్నారు. అధికార దుర్వినియోగం జరగకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'తప్పుడు కేసులకు అండదండలు అందించిన వారికి భయం కలిగేలా కఠినంగా వ్యవహరించాలి. బైండోవర్ కేసుల్లో పూచీకత్తుగా ఉన్న మొత్తాన్ని ఎట్టి పరిస్థితుల్లోను తగ్గించకూడద'ని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 292 కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి మాట్లాడుతూ తహసీల్దార్లు, వీఆర్వోలు వివరాల సేకరణలో పోలీసు అధికారులకు తగు సమాచారం అందించాలన్నారు.




సమావేశంలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి ఆర్డీవోలు సాయిప్రత్యూష, వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## జనవాసాల మధ్య మద్యం దుకాణం వద్దు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నరసింహనగర్, రెండోలైన్‌లో జనవాసాల మధ్య మద్యం దుకాణం పెట్టొద్దని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆర్ఎన్ మాధవి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యుఎస్ఎన్ రాజు, సిఐటియు వార్వా జిల్లా అధ్యక్షులు ఎన్.ప్రకాశరావు, సిఐటియు జోన్ నాయకులు డి..లక్ష్మీపతి, ఆర్. గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. జనావాసాలు, అపార్ట్‌మెంట్స్ మధ్యలో వైన్‌షాపు పెడతార్న సమాచారంతో స్థానిక మహిళలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాన్ని సందర్శించిన ఐద్వా, డివైఎఫ్ఐ, సిఐటియు నేతల బృందం, స్థానికులకు సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లేడీస్ హాస్టల్, కాలేజీలు ఉండడంతోపాటు నిత్యం జనసమర్ధంతోనున్న నివాసప్రాంతంలో మద్యం షాపు పెడితే మహిళలు, పిల్లలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేద న వ్యక్తం చేశారు. ఇప్పటికే నరసింహనగర్ రైతుబజార్ వద్ద సిటీ వైన్స్ పేరుతో ఉన్న పెద్ద వైన్‌షాప్‌తో ఆప్రాంతీయులు ఇబ్బంది పడే పరిస్థితి ఉందని, ఇప్పుడు కొత్తగా మరోమద్యం దుకాణం పెట్టడం సరికాదని, తక్షణం ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు స్థానికులు వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజా దర్బార్లో పలు వినతులు స్వీకరణ



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు నిర్వహించిన ప్రజాదర్బార్లో ప్రజలనుంచి వివిధ వినతులను స్వీకరించారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ లో అలకానంద కాలనీకి చెందిన బమ్మిడి తనుశ్రీ కి పింఛన్ ఇప్పించవలసిందిగా అమ్మమ్మ కోరారు. హుధూద్ సమయంలో తనుశ్రీ తండ్రి, కొన్ని నెలలకే తల్లి చనిపోయారని, అప్పటినుంచి పాపను తానే సాకుతున్నట్టు వినతిపత్రంలో పేర్కొన్నారు. అశోక్ నగర్, బూడి వీధికి చెందిన సత్యవరపు రాము అంగవైకల్యం కారణంగా ట్రై సైకిల్ ఇప్పించాలని కోరారు. కాటవీధికి చెందిన ఎల్ వెంకటేశ్వరరావు కరెంట్ షాక్ తో మృతి చెందారని, ఇన్సూరెన్స్ పొందేందుకు ఎలక్ట్రికల్ ఏఈ సర్టిఫికెట్ ఇవ్వలేదని వినతిపత్రంలో తెలిపారు. వీటి అగ్రహారం 35వ డివిజన్లో వీధిలైట్లు ఎక్కువ సంఖ్యలో పాడైపోయాయని వాటిని పునరుద్ధరించాలని కోరుతూ పైల మహేష్ వినతని ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుందని అన్నారు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పట్టణ అధ్యక్షులు గంటా రవి, ప్రధాన కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలి నాయుడు, ప్రధాన కార్యదర్శి పాసి అప్పలనాయుడు, నియోజకవర్గ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీని బలోపేతం చేయాలి: కోండ్రు

**రాజాం, పతాకం న్యూస్:** గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్, కార్యకర్తే అధినేత కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలో 325 వినతులు వస్తే 277 వినతులు పరిష్కరిం చామని చెప్పారు. నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి స హాయ నిధి చెక్కులను 235 మంజూరు చేశామన్నారు. మొత్తం రూ.2కోట్లు చెక్కులు అందజేసినట్టు తెలిపారు. గురువారం 17మంది లబ్ధిదారులకు రూ.5ల క్షల 95వేలు విలువగల చెక్కులను అందజేశా రు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థు లకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్య క్షుడు నంది సూర్యప్రకాషరావు, గురవాన నారాయణ రావు, వల్లూరు గణేష్, దూబ ధర్మారావు పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్సులను వెంటనే పెంచాలి





**గాజువాక, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీశక్తి పథకం మహిళలకు ఉచిత ఆర్‌టిసి ప్రయాణం అమలౌతున్న నేపథ్యంలో ప్రస్తుతమున్న బస్సులు ప్రయాణికుల అవసరాలకు సరిపోవడం లేదని, తక్షణమే మరిన్ని ఆర్‌టిసి సర్వీసులను పెంచాలని సిపిఎం సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. పాత గాజువాకలో ఆర్‌టిసి బస్ సర్వీసులను పెంచాలని కరపత్రాలను పంచుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్ పథకం అమలులో ఆర్‌టిసి బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగిందని, దానికి తగ్గట్టుగా అదనపు బస్సులు పెంచకపోవడంతో మహిళలతోపాటు వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు సకాలంలో గమ్యాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.. నిరసనలో సిపిఎం జోన్ నాయకులు ఎ.లోకేష్, జి రాము, కె.సంతోషం ఎం శ్రీదేవి, కె.సత్యనారాయణ, కెపి.కుమార్, గొలగాని అప్పారావు, ఎస్ గణేష్, స్వర్ణలత, జి.మణి పాల్గొన్నారు.

## స్కూల్ ఆయాలు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల సమ్మె నోటీసు



**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, తరగతి గదులు, బాత్రూములు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న స్కూల్ శానిటరీ వర్కర్స్ ఫిబ్రవరి 12 న దేశవ్యాప్త సమ్మె లో పాల్గొంటున్నామని విజయనగరం అర్బన్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యులకు శుక్రవారం సమ్మె నోటీసులు ఇచ్చారు. నెల జీతం 3000/- లు, 6000/- లు తో ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. నెలల తరబడి బకాయిలుంటే ఏం తినాలని, బిల్లులు ఇవ్వకపోతే పిల్లలకు ఎలా పెట్టాలని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లాడికి కనీసం మెనూ చార్జి రోజుకి రూ.20/-, జీతం 12,000/- చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా , 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఎస్ బి ఐ ద్వారా ప్రభుత్వమే చేయించాలన్నారు. తోట పాలెం, జన్నగుడ్డి, శ్రమ ఫల , ఎరుకులపేట, రాజీవ్ నగర్ కాలనీ, బియ్యలపేట, వీటి అగ్రహారం కంటోన్మెంట్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యులకు సమ్మె నోటీస్‌లు ఇచ్చినట్లు సిఐటియు జిల్లా కోశాధికారి ఏ జగన్మోహన్రావు రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై .నందిని, స్వప్న, నారాయణమ్మ, ఉమా పాల్గొన్నారు.

## సంపూర్ణ హక్కులు కల్పించడమే లక్ష్యం



**పాతపట్నం, పతాకం న్యూస్:** రైతులకు సంపూర్ణ భూహక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బూరగాం గ్రామంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమ సొంత ఫొటోలను వేసుకొని రైతుల భూములపై తమ పెత్తనం చెలాయించేలా వైసీపీ నేతలు నిరంకుశంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వస్తి పలికారని తెలిపారు. మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. గ్రామంలోగల జడ్డెమ్మతల్లి ఆలయానికి ప్రహరీ నిర్మా ణానికి, చంద్రశేఖరుని ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి వారం రోజులలో నిధులు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, ప్రహ్లాద్ పొల్లాయ్, మడ్డు రామారావు, సైలాడ సతీష్, తహశీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఎంపీడీవో రమణమూర్తి పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



**రాజంపేట, పతాకం న్యూస్:** ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డి.నాగరాజు ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోనే వైద్య సిబ్బంది పని తీరు, ఐ.పి, ఓ.పి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఏఎన్ఎం లు, ఆశాలు గ్రామాలలోని హై రిస్క్ గర్భవతులను గుర్తించి ఆసుపత్రిలో చూపించి ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు అయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం పాటించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, లక్ష్మీ ప్రసన్న, సబ్ యూనిట్ అధికారి ఎస్.ఎస్ దాస్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# గర్భస్రావంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు.. 30 వారాల గర్భం తొలగింపునకు అనుమతి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** గర్భస్రావానికి సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. పుట్టబోయే బిడ్డ హక్కు కంటే తల్లి పునరుత్పత్తి స్వేచ్ఛకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేసింది. ఇష్టానికి విరుద్ధంగా గర్భాన్ని కొనసాగించాలని ఏ మహిళను బలవంతం చేయలేమని తేల్చిచెప్పింది. ఈ మేరకు 30 వారాల గర్భంతో ఉన్న 18 ఏళ్ల యువతికి గర్భస్రావం చేయించుకునేందుకు అనుమతి ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... 17 ఏళ్ల వయసులో ఓ యువతి తన స్నేహితుడితో సంబంధం కారణంగా గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమె వయసు 18 ఏళ్లు కాగా, గర్భం 30 వారాలకు చేరుకుంది. గర్భస్రావం కోసం ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం అనుమతి నిరాకరించింది. బిడ్డను ప్రసవించి, దత్తతకు ఇచ్చేయాలని సూచించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ యువతి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ దశలో బిడ్డను కనడం వల్ల యువతి మానసికంగా, శారీరకంగా తీవ్ర వేదనకు గురవుతుందని అభిప్రాయపడింది. సామాజిక కారణాల వల్ల ఆమె తీవ్ర అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న వాదనను పరిగణనలోకి తీసుకుంది. గర్భస్రావం వల్ల యువతి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని మెడికల్ బోర్డు నివేదిక ఇచ్చిన విషయాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. "పుట్టబోయే బిడ్డ ప్రయోజనాలా? లేక జన్మనిచ్చే తల్లి ప్రయోజనాలా?.. ఎవరికి ప్రాధాన్యత ఇవ్వాలి? తల్లి ఇష్టానికి వ్యతిరేకంగా గర్భం దాల్చమని కోర్టు బలవంతం చేయలేదు" అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. చట్టపరమైన మార్గాలు మూసుకుపోతే, మహిళలు అక్రమ మార్గాల్లో గర్భస్రావాలు చేయించుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. బాంబే హైకోర్టు తీర్పును పక్కనపెడుతూ, యువతి గర్భస్రావానికి ధర్మాసనం అనుమతి ఇచ్చింది. భారత చట్టాల ప్రకారం 24 వారాల తర్వాత గర్భస్రావానికి కేవలం కోర్టు అనుమతి మాత్రమే ఏకైక మార్గం. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది.

# సినీ పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం దిల్ రాజు మాతో మాట్లాడుతుంటారు: మల్లు భట్టి విక్రమార్క



**హైదరాబాద్, పతాకం న్యూస్:** చిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్ రాజు ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో మాట్లాడుతుంటారని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సినీ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం తరఫున ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నా సలహాలు, సూచనలు ఇస్తుంటారని, అందుకు ఆయనను అభినందిస్తున్నానని అన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టాలీవుడ్ ఎలాంటి సాయం కోరినా తెలంగాణ ప్రభుత్వం చేస్తుందని హామీ ఇచ్చారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా చేయాలనేది తమ ప్రభుత్వం సంకల్పమని అన్నారు. ఈ మేరకు బ్లూప్రింట్ సిద్ధం చేశామని తెలిపారు.

సినిమా రంగం ద్వారా సామాజిక సందేశాలు ఇవ్వడంతో పాటు వాణిజ్య పరంగా లబ్ధి పొందవచ్చని అన్నారు. చిత్ర పరిశ్రమ ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని తెలిపారు. పరిశ్రమకు ఎలాంటి అవసరం వచ్చినా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ప్రత్యేకంగా చెప్పమన్నారని తెలిపారు. వారు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉన్నందున వారి తరఫున చెబుతున్నానని అన్నారు. గద్దర్ అవార్డుల వేడుకను దిల్ రాజు ఓ బాధ్యతగా స్వీకరించారని అన్నారు.

# మచిలీపట్నం పోర్టు అనుసంధాన హైవేకు రూ.573 కోట్లు మంజూరు



**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ వైపు నుంచి వెళ్లే వాహనాలు నేరుగా మచిలీపట్నం పోర్టుకు రాకపోకలు సాగించేందుకు వీలుగా అనుసంధాన హైవే నిర్మాణానికి రూ.573.77 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. దీంతో 8 కి.మీ. మేర ఆరు వరుసలతో దీనిని నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ (మోర్త్) ఉన్నతాధికారుల నుంచి ఇక్కడి అధికారులకు ఆదేశాలొచ్చాయి. ఇప్పటికే మచిలీపట్నం పోర్టు పనులు వేగంగా సాగుతుండగా అది అందుబాటులోకి వచ్చేలోపు అనుసంధాన హైవేను కూడా పూర్తిచేసేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు 64 కి.మీ. మేర ఇప్పుడున్న హైవే-65ని నాలుగు వరుసల నుంచి ఆరు వరుసలుగా విస్తరించేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఇందుకు రూ.1,100 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ హైవే మచిలీపట్నం శివారులోని సుల్తాన్ నగర్ వద్ద కత్తిపూడి-ఒంగోలు హైవే-216ని క్రాస్ చేస్తుంది. సరిగ్గా అక్కడి నుంచే మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేసే హైవే పనులు మొదలవుతాయి.

సుల్తాన్‌నగర్ కూడలి వద్ద వద్ద ప్రస్తుతం రెండు వరుసల ఫ్లైఓవర్ ఉంది. దానిని ఆరు వరుసల ఫ్లైఓవర్‌గా విస్తరిస్తారు. అక్కడి నుంచి హైవే-216పై పెడనవైపు హర్ష కాలేజీ సమీపం వరకు దాదాపు 4 కి.మీ. మేర ఆరు వరుసలుగా విస్తరిస్తారు. హర్ష కాలేజీ సమీపం నుంచి కుడివైపునకు పోర్టుకు వెళ్లేందుకు ఆరు వరుసలతో నాలుగు కి.మీ. మేర కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించనున్నారు. అంటే మొత్తం 8 కి.మీ.లలో నాలుగు కి.మీ. ప్రస్తుత హైవే విస్తరణ, మిగిలిన నాలుగు కి.మీ. కొత్త హైవే నిర్మాణం చేయనున్నారు.

అభ్యర్థనలను మన్నించి మచిలీపట్నం పోర్టు అనుసంధాన హైవేకి రూ.573 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి మచిలీపట్నం జనసేన ఎంపీ వి.బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు. మచిలీపట్నం శివారు సుల్తాన్‌నగర్ వద్ద విజయవాడ హైవే, కత్తిపూడి-ఒంగోలు హైవేలో కలిసే చోట క్లోవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్ వంతెన నిర్మించేలా తొలుత ప్రతిపాదించారు. అయితే ఇందుకు ఆ కూడలికి నాలుగు వైపులా పెద్దఎత్తున భూములు అవసరం ఉంటుంది. దీంతో స్థానికంగా రైతులు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో క్లోవర్‌లీఫ్ వంతెన ప్రతిపాదన పక్కనపెట్టారు. దీనికి బదులు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అంటే పోర్టువైపు నుంచి వచ్చే వాహనాలు.. విజయవాడవైపు వెళ్లే హైవే-65లో నేరుగా కలిసేలా సుల్తాన్‌నగర్ వద్ద ఇప్పుడున్న ఫ్లైఓవర్‌పై మరో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అయితే ఆ కూడలిలో ఇంటర్‌ఛేంజ్ నిర్మించకపోతే భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు తలెత్తనున్నాయి.

ఎన్‌హెచ్-65, 216 జంక్షన్ నుంచి మచిలీపట్నం పోర్టుకు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణానికి రూ.573.77 కోట్లు మంజూరుచేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరీ గురువారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీనివల్ల పోర్టుకు సరకు రవాణా చేసే సమయం గణనీయంగా తగ్గుతుందని, లాజిస్టిక్ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఆరు వరుసల ప్రధాన హైవేతోపాటు, సర్వీస్ రోడ్లు, మూడు చోట్ల ఫ్లైఓవర్లు, ఓ రైల్వే వంతెన నిర్మించనున్నట్లు తెలిపారు.

విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు జాతీయ రహదారి 63 కిలోమీటర్ల మేర ఉంది. ఇందులో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కంకిపాడు-ఉయ్యూరు మధ్య చలివేంద్రపాలెం దగ్గరలో క్రాస్ అవుతుంది. అక్కడి నుంచి మచిలీపట్నం వరకు 44 కిలోమీటర్ మేర ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల మార్గాన్ని 6 వరుసలుగా విస్తరిస్తారు. మచిలీపట్నం వద్ద ఒంగోలు-కత్తిపూడి నేషనల్ హైవే రెండు వరుసలతో ఉంది.

# రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి




**కర్నూలు, పతాకం న్యూస్:** రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కార్మిక కర్షక భవన్ లో కర్నూల్ న్యూ సిటీ కార్యదర్శి సి. శేషాద్రి అధ్యక్షతన రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చెయ్యాలని, రజకుల సమస్యలు -- ప్రభుత్వ విధానాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. గురు శేఖర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు, విశ్వకర్మ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవ పూజల. ధనుంజయఆచారి, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర కార్యదర్శి ఈశ్వరయ్య, వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రవి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకురాలు నోమేశ్వరి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు, సిఐటియు జిల్లా నాయకులు ప్రభాకర్, నరసింహులు, నగేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధానశ్రీ కార్యదర్శి అబ్దుల్లా ,అధ్యక్షులు రాఘవేంద్ర,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్, నగర కార్యదర్శి అంజి, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ, గొర్రెల మేకల పెంపక దారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి. ఆంజనేయులు, పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల నాయకులు ముక్తకంఠంతో ఏకగ్రీవంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబి పోస్టులు భర్తీ చేసి యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని, రజకుల సంక్షేమానికి రాబోయే బడ్జెట్లో కనీసం 1000 కోట్ల రూపాయలు కేటాయించి రజకుల సంక్షేమానికే ఖర్చు చేయాలని చెప్పారు. చెరువులు గుంటల పైన రజకులకే పూర్తి హక్కు కల్పించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో సిహెచ్ శ్రీనివాసులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సి. గురుశేఖర్ మాట్లాడుతూ సమాజంలో వెనకబడిన తరగతులకు మహిళలకు భద్రత కరువైందని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కోరే న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం చేసే పోరాటాలకు వ్యాప్తంగా మద్దతు తెలియజేస్తూ కార్యక్రమాల్లో పాల్గొంటామని మద్దతు ప్రకటించిన వివిధ ప్రజా సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న వెనకబడిన తరగతుల వృత్తిదారులు( బీసీలకు) సామాజిక రక్షణ చట్టం హామీ వెంటనే అమలు చేయాలని, జీవో నెంబర్ 27 ప్రకారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల్లో దోబీ పోస్టులు భర్తీ చేసి రజక కుటుంబాల్లో ఉన్న యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని, వృత్తి పనిచేసేందుకు చెరువులు, దోభి ఘాటు స్థలాల పైన రజకులకే పూర్తి హక్కు కల్పించాలని చెప్పారు. రాబోయే బడ్జెట్లో రజకుల సంక్షేమానికి కనీసం 1000 కోట్లు కేటాయించి వృత్తిదారులకు ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో రజక సంక్షేమ కమిటీ ఏర్పాటు చేసి రజకుల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని విలువైన సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం అన్ని మండలాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, జరిపి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఆందోళనకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్మిక సంఘాలు తలపెట్టిన ఫిబ్రవరి 12వ తారీకు దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పర్ల సుంకన్న, న్యూ సిటీ అధ్యక్షుడు సి. రాముడు, ఓల్డ్ సిటీ కార్యదర్శి సి .జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పుష్ప, ఎల్లప్ప, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, రమణ, కర్నూల్ నగర నాయకులు కర్రెన్న, మద్దిలేటి, రమేష్, మధు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**అమరావతి, పతాకం న్యూస్:** దేశంలోని కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు కేంద్ర ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని ఆరోపిస్తూ, కార్మిక--రైతు సంఘాలు ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో సిఐటియు ఏఐటీయూసీ ఇతర కార్మిక సంఘాల జిల్లా జాత శుక్రవారం మంగళగిరి కి చేరుకుంది. ఎయిమ్స్ ప్రధాన ద్వారం వద్ద జాతకు నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా అంబేద్కర్ సెంటర్ కు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాలిగోపురం వద్ద గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా మెయిన్ బజార్ మీదగా పూల మార్కెట్ సెంటర్ కు చేరుకుంది. ఆయా సెంటర్లో కార్మికులను ఉద్దేశించి ఏఐటీయూసీ, సిఐటియు నాయకులు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, వ్యవసాయ రంగ విధానాలు సామాన్య ప్రజల జీవనాధారాలను దెబ్బతీస్తున్నాయని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నదని సంఘాల నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. కార్మిక వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయాలని, వాటి వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత, వేతన భద్రత, కార్మిక హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని అన్నారు. కార్మికుల హక్కులను హరించడమే లక్ష్యంగా కేంద్రం విధానాలు రూపొందిస్తోందని విమర్శించారు.అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ను నిర్వీర్యం చేసే చర్యలను వెంటనే నిలిపివేయాలన్నారు.

# పెద్ద పేగు క్యాన్సర్ ఉంటే ఆరంభంలో కనిపించే లక్షణాలు ..

ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ప్రేగు క్యాన్సర్ తో బాధపడే వారి సంఖ్య, ఈ సమస్యతో మరణించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఈ సంస్థ అంచనా ప్రకారం 2020లో దాదాపు 9,30,000 మరణాలు సంభవించాయని, 1.9 మిలియన్ల కొత్త కేసులు నమోదయ్యాయని తేలింది. 2040 నాటికి ఈ గణంకాలు మరింత ఆందోళనకరంగా తయారయ్యే పరిస్థితి నెలకొంటుందని వారు చెబుతున్నారు. పెద్ద ప్రేగు క్యాన్సర్ ను ముందుగా గుర్తించడం చాలా అవసరం. కానీ ఈ సమస్య ముందస్తు లక్షణాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. సాధారణ జీర్ణ సమస్యలు అని చాలా మంది తేలికగా తీసుకుంటారు. పెద్ద ప్రేగు క్యాన్సర్ ప్రారంభ దశలో మనకు కనిపించే కొన్ని లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



పెద్ద ప్రేగు క్యాన్సర్ ప్రారంభ దశలో ఉన్నప్పుడు మలబద్ధకం, మలం ఆకారంలో మార్పు రావడం, నిరంతరం విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రేగులో పెరుగుతున్న కణతి కారణంగా ఈ లక్షణాలు తాత్కాలికం నుండి శాశ్వతంగా మారతాయి. అలాగే మలంలో ఎర్రని రక్తం లేదా ముదురు రంగులో మలం గమనించినట్లయితే దీనిని అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. మలంలో రక్తం రావడాన్ని గమనించినట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలి. అలాగే ఆహారంలో మార్పులు, వ్యాయామం వంటివి చేయకుండానే 10 పౌండ్లు లేదా అంతకంటే ఎక్కువ బరువు తగ్గుతారు. పోషకాహార లోపం, శరీర శక్తిని వినియోగించే కణతులు, జీర్ణక్రియలో మార్పులు వంటి కారణాల వల్ల కూడా బరువు తగ్గుతారు. పెద్ద ప్రేగు ప్రారంభ లక్షణాల్లో ఇది కూడా ఒకటి. అలాగే తగినంత నిద్రపోయినప్పటికీ నిరంతరం అలసటగా ఉండడం కూడా ఒక సంకేతమే. అంతర్గత రక్తస్రావం వల్ల వచ్చే ఐరన్ లోపం రక్తహీనతకు దారి తీస్తుంది. దీంతో నిరంతరం అలసటగా ఉంటుంది. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు.

ఇక చిన్న వయసులోనే పెద్ద ప్రేగు క్యాన్సర్ బారిన పడే వారి సంఖ్య పెరుగుతుంది. కనుక లక్షణాలను అస్సలు విస్మరించకూడదు. జన్యుపరంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నవారు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం మంచిది. చికిత్సను ఆలస్యం చేయడం వల్ల కొన్నిసార్లు మరణం సంభవించే అవకాశం కూడా ఉంది. కడుపు నొప్పి, మలంలో రక్తం వంటి లక్షణాలు చాలా మందిలో కనిపిస్తాయి. వీటిని తేలికగా తీసుకుని ఇతర అనారోగ్య సమస్యగా భావించి తప్పుడు చికిత్స తీసుకుంటూ ఉంటారు. దీంతో సమస్య మరింత కష్టతరంగా మారుతుంది. అలాగే మీ వయసు 45 నుండి 50 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్నా కూడా ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు చెబుతున్నారు.

# మొటిమలు తగ్గట్లేదా..

ప్రస్తుతం యువతకు పెద్ద సమస్య ముఖంపై మొటిమలు రావడం. ఈ మొటిమల సమస్యకు అనేక మంది ఎన్నో రకాల సౌందర్య సాధనాలను వాడుతుంటారు. కానీ చాలా రకాల ఉత్పత్తులు యువత ఆశించిన విధంగా పని చేయకపోవడం వలన వారు దిగులు చెందుతూ ఉంటారు. అనేకసార్లు సౌందర్య ఉత్పత్తులను మారుస్తూ ఉంటారు. ఇలా అనేక రకాల సౌందర్య ఉత్పత్తులను వాడడం వలన కూడా చర్మ సౌందర్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇలా మొటిమలు రావడానికి అనేక రకాల కారణాలు ఉన్నాయని నిపుణులు తెలుపుతున్నారు. మొటిమలు రావడానికి ప్రస్తుత జీవనశైలి విధానం కూడా ఒక కారణమని అనేక మంది అభిప్రాయం. మన ముఖం మీద మొటిమల దాడిని ముందే గ్రహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. మొటిమలు దాడి చేసే ముందే మన చర్మం లోపల ఉన్న ఆరోగ్యకర కణాలు నశిస్తాయి. కణాలు పాడవడం వలన చర్మం మీద మొటిమలు ఏర్పడే అవకాశం ఉంటుంది. కేవలం ఇది మాత్రమే కాకుండా మన చర్మం పొడి బారడం వలన కూడా మొటిమలు ఏర్పడే చాన్స్ ఉంది. మన చర్మం మీద ఉండే రంధ్రాలు బ్లాక్ అయినపుడు కూడా మొటిమలు వస్తాయి. మానవ శరీరంలో చర్మం అనేది చాలా సున్నితమైన అవయవం. కావున చర్మాన్ని ఆరోగ్యంగా చూసుకునేందుకు అనేక రకాలుగా జాగ్రత్తలు తీసుకోవాలి. సమయం ప్రకారం చర్మానికి కావాల్సిన అవసరాలు తీరుస్తూ ఉండాలి. చర్మ సౌందర్యం గురించి జాగ్రత్తలు తీసుకోవడంలో వివిధ రకాల వ్యక్తులు వివిధ రకాలుగా వ్యవహరిస్తూ ఉంటారు. కొంతమంది అధిక ధర ఉన్న సౌందర్య సాధనాలు వాడితే కొంత మంది మాత్రం ఎటువంటి సౌందర్య సాధనాలు వాడకుండా ఉంటారు. కానీ ఇలా అనేక రకాల సౌందర్య సాధనాలను చర్మంపై ప్రయోగించడం మంచిది కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇలా అనేక రకాల సౌందర్య సాధనాలను వాడడం వలన కూడా మన చర్మంపై మొటిమలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ సమస్య యువతను చాలా వేధిస్తుంది. ఈ సమస్య గురించి తప్పించుకునేందుకు అనేక మంది అనేక రకాలుగా ప్రయత్నిస్తూ ఉంటారు. మార్కెట్‌లో దొరికే అన్ని రకాల చర్మ సౌందర్య ఉత్పత్తులను వాడి అలసిపోతారు.

ముఖంపై మొటిమలు వచ్చే ప్రమాదం ఉందనుకున్న సమయంలో మన చర్మంలో ఉండే ఆరోగ్య కరమైన కణాలు చర్మం మీది పొరకు వస్తాయి. ఆరోగ్యకర కణాల టర్నోవర్ రేటు పెరగడం వలన మన చర్మంపై మొటిమలు రాకుండా ఉంటాయి. మన చర్మం అనేక లేయర్లను కలిగి ఉంటుంది. కనుక ఒక లేయర్ పాడయిపోయినప్పటికీ మరో లేయర్ మన చర్మంపై మొటిమలు రాకుండా కాపాడుతుంది. కానీ మన చర్మం పొడి బారి పోయినపుడు మొటిమలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రముఖ ఆరోగ్య నిపుణులు చెప్పిన దాని ప్రకారం.. మానవ శరీరం చూసేందుకు ఎటువంటి తేడా లేకుండా ఉన్నా.. చర్మం రకాలు వివిధ రకాలుగా ఉంటాయి. ఆయిలీ, డ్రై తదితర రకాలు ఉంటాయి. అన్ని రకాల సౌందర్య సాధనాలు వివిధ రకాల చర్మాలు గల వారికి అంతగా సరిపోవు. కావున ఏదైనా ఉత్పత్తిని కొనే ముందు ఎటువంటి రకం చర్మం కల వారికి సరిగ్గా సరిపోతుందో చూసి కొనాలి. ఒకే రకమైన సౌందర్య ఉత్పత్తులు అందరికీ సరిపోవనే విషయం గుర్తుంచుకోవాలి.



# విద్యుత్ కష్టాలకు చెక్

## పలు పంచాయతీలకు తొలగనున్న విద్యుత్తు సమస్యలు



**అమరావతి, పతాకం న్యూస్:** చోడవరంలో విద్యుత్ లోవోల్టేజీ, ఇతర సమస్యలను తొలగించేందుకు లక్ష్మీపురం పంచాయతీ శివారులో చేపట్టిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇక్కడి నుంచి పంచాయతీలకు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు దాదాపు పూర్తయ్యాయి. నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఈ నెలలోనే ప్రారంభిస్తారని సమాచారం.

చోడవరంతోపాటు చుట్టు పక్కల వున్న మరో తొమ్మిది పంచాయతీలకు ఒకే ఒక్క విద్యుత్ సబ్ స్టేషన్ వుండడంతో వినియోగదారులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. లోఓల్టేజీ సమస్యతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు పెరిగిపోతే ట్రిప్ అవుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతున్నది. విద్యుత్ కనెక్షన్లతోపాటు విద్యుత్ వినియోగం కూడా రోజు రోజుకీ పెరిగిపోతుండడంతో ఈ సమస్య మరింత అధికం అవుతున్నది. వేసవిలో విద్యుత్ వినియోగం గరిష్ఠస్థాయికి చేరితే అధిక లోడుతో ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అయ్యేవి. దీంతో కొన్నిసార్లు రాత్రిపూట గంటల తరబడి విద్యుత్ సరఫరా లేని పరిస్థితి నెలకొంటున్నది. దీనిని నివారించడానికి మరో సబ్‌స్టేషన్ నిర్మించాలని వినియోగదారులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. గత తెలుగుదేశం హయాంలోనే 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ మంజూరుకాగా, తరువాత వచ్చిన వైసీపీ పాలకులు సబ్‌స్టేషన్‌కు కేటాయించిన స్థల వివాదాన్ని పరిష్కరించలేదు. మళ్లీ టీడీపీ ఆధ్వర్యంలో కూటమి అధికారంలోనికి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరు చేయించారు. దీనిని నిర్మాణానికి లక్ష్మీపురం సమీపంలో స్థలం సమకూర్చారు. టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి, యుద్ధప్రాతిపదికను పనులు చేయించారు. ఈ సబ్‌స్టేషన్‌ను చీడికాడ రోడ్డులో ఉన్న మరో సబ్‌స్టేషన్‌తో అనుసంధానం చేశారు. కొత్త సబ్ స్టేషన్ ద్వారా నరసయ్యపేట, గౌరీపట్నం, లక్ష్మీపురం, గాంధీగ్రామం పంచాయతీకు, ఇప్పటికే వున్న సబ్‌స్టేషన్ ద్వారా చోడవరం, అంకుపాలెం, శ్రీరాంపట్నం, ఖండేపల్లి, దామునాపల్లి, మైచర్లపాలెం, పీఎస్‌పేట పంచాయతీలకు విద్యుత్ సరఫరా అవుతుంది. కొత్త సబ్‌స్టేషన్‌ను మరికొద్ది రోజుల్లో ప్రారంభిస్తామని, దీంతో పలు పంచాయతీలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

# పట్టాదారు పాసుపుస్తకం క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలు



**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** పట్టాదారు పాస పుస్తకంలోని క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కుర్రోతల వెంకటరాజు గారి పల్లి గ్రామాలలోని పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాదారు పాస్ పుస్తకం లోని క్యూఆర్ కోడ్ ద్వారా భూమి యజమాని మరియు భూమి వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని అన్నారు. జిల్లాలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న రాజముద్రతో కలిగిన నూతన పట్టదార పుస్తకాలను ప్రతి రైతు పొందాలన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో అధునాతన సాంకేతికత ద్వారా భూమి సమస్యలను వివాదాల పరిష్కరించుకోవచ్చని అన్నారు. సాంకేతికతతో సెంటీమీటర్ కూడా తేడా జరగకుండా రి సర్వేలో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ అధునాతన సాంకేతికత ద్వారా రైతుకు ఎంత భూమి ఉండేది, ఎక్కడ ఉండేది అన్న అంశాలు స్పష్టంగా తెలుసుకోవచ్చని అన్నారు. ప్రతి రైతు ప్రభుత్వం అందిస్తున్న ఈ రాజముద్రగలిగిన పట్టాదారు పాసుపుస్తకాలు పొందాలన్నారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడారు. పట్టాదారు పాస్టర్ పుస్తకంలో సరైన వివరాలు నమోదు చేసి ఉన్నారా? ఏమైనా పొరపాట్లు ఉన్నాయా అన్న విషయాలపై ఆరాతీశారు. పట్టాదారు పాసుపుస్తకం లో ఆధార్ నెంబరు సరిగా ఉన్న లబ్ధిదారి వివరాలు అన్నీ ఖచ్చితంగా ఉండాలని లేని పక్షంలో రెవెన్యూ అధికారులకు దర్యాప్తు రూపంలో ఫిర్యాదు చేసి తప్పులను సరిదిద్దుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతి కుమార్, ఆర్ఐ రాజేష్ ,విఆర్ఓ లక్ష్మీకాంతమ్మ , రైతులు పాల్గొన్నారు.




## అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్ సూర్యవంశీ సూపర్ సెంచరీ... భారీ స్కోరు దిశగా భారత్



అండర్ 19 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో భారత యువ జట్టు పరుగుల సునామీ సృష్టిస్తోంది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఈ తుది పోరులో భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత శతకంతో కదం తొక్కాడు. కేవలం 55 బంతుల్లోనే 100 పరుగులు చేశాడు. సూర్యవంశీ విధ్వంసక బ్యాటింగ్‌తో భారత్ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ ఆయుష్ మాత్రే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, జట్టు స్కోరు 20 పరుగుల వద్ద ఓపెనర్ ఆరోన్ జార్జ్ (9) వికెట్‌ను కోల్పోయి భారత్ ఆరంభంలో తడబడింది. ఈ క్లిష్ట దశలో వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఇంగ్లండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ముఖ్యంగా వైభవ్ తనదైన శైలిలో దూకుడుగా ఆడుతూ పరుగుల వేగాన్ని పెంచాడు.

ఈ జోడీ రెండో వికెట్‌కు 90 బంతుల్లో 142 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును పటిష్ట స్థితిలో నిలిపింది. ఈ క్రమంలో కెప్టెన్ ఆయుష్ 51 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 53 పరుగులు చేసి అలెక్స్ గ్రీన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. మరోవైపు, ఆరంభం నుంచే బౌండరీల మోత మోగించిన వైభవ్ సూర్యవంశీ, మైదానం నలువైపులా చూడచక్కని షాట్లతో అలరించాడు. ప్రస్తుతం సూర్యవంశీ 67 బంతుల్లో 145 పరుగులతో క్రీజులో ఉన్నాడు. అతడి స్కోరులో 12 ఫోర్లు, 12 సిక్సులు ఉన్నాయి. పలుమార్లు బంతి స్టేడియం బయటికి వెళ్లిందంటే సూర్యవంశీ ఎంత పవర్ ఫుల్ షాట్లు కొడుతున్నాడో అర్థమవుతుంది. దాదాపు 190 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ ఇంగ్లండ్ బౌలింగ్‌ను చిన్నాభిన్నం చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో అలెక్స్ గ్రీన్ రెండు వికెట్లు పడగొట్టినప్పటికీ, మిగతా బౌలర్లు వైభవ్ ధాటికి తేలిపోయారు. ఫర్హాన్ అహ్మద్, మ్యానీ లమ్స్‌డెన్ వంటి బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

# డబ్ల్యూపీఎల్ విజేతగా బెంగళూరు



మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) సీజన్-4 టైటిల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) మహిళలజట్టు గెలుచుకుంది. కోటాంబిలోని బిసిఎ స్టేడియంలో నల్లో ఆర్సీబీ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. డబ్ల్యుపిఎల్ టైటిల్ చరిత్రలో 204పరుగుల భారీ లక్ష్యాన్ని ఒక జట్టు ఛేదించడం ఇదే తొలిసారి. భారీ ఛేదనలో భాగంగా బెంగళూరుకు శుభారంభం దక్కకున్నా... 2వ వికెట్‌కు కెప్టెన్ మంధాన, జార్జియో వోల్ 92బంతుల్లో 165 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. బెంగళూరు గెలుపుకు 21 బంతుల్లో 30పరుగులు చేయాల్సిన దశలో వోల్(79; 54బంతుల్లో 14ఫోర్లు)ను మిన్నుమణి ఔట్ చేయడంతో ఢిల్లీ ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత మంధాన(87; 41బంతుల్లో 12ఫోర్లు, 3సిక్సర్లు)కి తోడు చివర్లో రాధా యాదవ్(12నాటౌట్; 5బంతుల్లో 2ఫోర్లు కొట్టి మ్యాచ్‌ను ముగించారు. ఢిల్లీ బౌలర్లు హెన్రీకి రెండు, నందిని శర్మ, మిన్ను మణికి ఒక్కో వికెట్ దక్కాయి. అలాగే ఒక డబ్ల్యుపిఎల్ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ మంధాన రికార్డు పుటల్లోకెక్కింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ స్మృతి మంధానకు దక్కాయి.

టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి ఓపెనర్లు 49పరుగుల పునాదిని వేశారు. లిజెల్లి లీ-షెఫాలీ వర్మ కలిసి ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో ఢిల్లీ క్యాపిటల్స్ 5.5ఓవర్లలోనే ఈ స్కోర్ సాధించింది. ఈ క్రమంలో షెఫాలీ వర్మ(20)ను అరుంధతి రెడ్డి పెవిలియన్ పంపింది. దాంతో. 49 పరుగుల వద్ద వీరి భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వస్తూనే లారా వొల్వార్డ్(44) మొదటి బంతిని బౌండరీకి పంపి, మరో ఎండ్‌లో లిజెల్లీ లీ(37) దూకుడు పెంచారు. దీంతో ఢిల్లీ జట్టు పవర్ ప్లే 6ఓవర్లలో వికెట్ నష్టానికి 53 పరుగులు చేసింది. ఆ తర్వాత కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్(57; 37బంతుల్లో 8ఫోర్లు) వేగంగా పరుగులు రాబట్టింది. ఈ క్రమంలో రోడ్రిగ్స్‌ను సయాలీ సత్‌గైర్ ఔట్ చేయడంతో ఢిల్లీ జట్టు 148పరుగుల వద్ద మూడో వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత వోల్వర్ట్(44) చివరి బంతికి రనౌట్ కాగా. హెన్రీ(35నాటౌట్)తో కలిసి కీలక ఇన్నింగ్స్ ఆడింది. దీంతో ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీస్కోర్ చేసింది. బెంగళూరు బౌలర్లు సయాలీ సత్‌గేర్, డి-క్లార్క్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.




# నెగటివ్ షేడ్స్ పాత్రలో రష్మిక?



నటి రష్మిక మందన్న తన వ్యక్తిగత, వృత్తిగత జీవితానికి సంబంధించిన వార్తలతో మరోసారి మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఒకవైపు నటుడు విజయ్ దేవరకొండతో ఆమె వివాహం జరగనుందనే ప్రచారం జోరుగా సాగుతుండగా, మరోవైపు ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ షూటింగ్‌లో అడుగుపెట్టారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ చిత్రంలో రష్మిక జాయిన్ అయ్యారు.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది. ఈ వారంలోనే రష్మిక సెట్స్‌లోకి అడుగుపెట్టి తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఫిబ్రవరి మధ్య వరకు ఈ షెడ్యూల్‌లో ఆమె పాల్గొంటారని సమాచారం. ఈ చిత్రంలో రష్మిక తన కెరీర్‌లోనే తొలిసారిగా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని కొన్ని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తున్నారు.

ఇక వృత్తిపరంగా బిజీగా ఉంటూనే, రష్మిక పెళ్లి వార్తలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 2న వీరి వివాహం అంటూ వచ్చిన వార్తలను రష్మిక ప్రతినిధులు ఖండించినా, ఇప్పుడు కొత్తగా ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరగనుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇటీవల ఎయిర్‌పోర్ట్‌లో దీనిపై మీడియా ప్రశ్నించగా, "దేనికి రా?" అంటూ చిరునవ్వుతో బదులిచ్చి రష్మిక దాటవేయడం ఈ వార్తలకు మరింత బలాన్నిచ్చింది. ఫిబ్రవరి మధ్యలో షూటింగ్ నుంచి ఆమె విరామం తీసుకోనుండటం కూడా ఈ పెళ్లి కోసమేనని ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయంపై రష్మిక గానీ, విజయ్ దేవరకొండ గానీ అధికారికంగా స్పందించలేదు. ఈ విషయంపై నేరుగా స్పందించలేదు. పెళ్లి తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో త్వరలోనే ఏదో ఒక అధికారిక క్లారిటీ వచ్చే అవకాశం ఉందని ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న 'మృత్యుంజయ'



విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త థ్రిల్లర్ మూవీ 'మృత్యుంజయ' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో రెబా జాన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఈ సందర్భంగా శ్రీవిష్ణు తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకున్నారు. "ఫిబ్రవరి 27న 'మృత్యుంజయ' థియేటర్లలో మీ హృదయాలను గెలుచుకోవడానికి వస్తోంది. ఈ థ్రిల్లింగ్ కథతో మిమ్మల్ని కలుస్తాను" అని రాసుకొచ్చారు. హీరోయిన్ రెబా జాన్ కూడా పోస్టర్ షేర్ చేస్తూ, "ప్రతి సమాధానం మరో ప్రాణాంతకమైన ప్రశ్నను లేవనెత్తుతుంది. ఫిబ్రవరి 27న 'మృత్యుంజయ' సినిమా హాళ్లలోకి వస్తోంది" అని పేర్కొన్నారు.

హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై మొదటి నుంచి మంచి అంచనాలు ఉన్నాయి. గతేడాది విడుదలైన టైటిల్ టీజర్, సినిమా ఒక ఆసక్తికరమైన క్రైమ్ థ్రిల్లర్ అని స్పష్టం చేసింది. ఇందులో రెబా జాన్ ఒక పోలీస్ అధికారి పాత్రలో నటిస్తుండగా, శ్రీవిష్ణు పాత్రపై సస్పెన్స్ కొనసాగుతోంది. టీజర్‌లోని కొన్ని విజువల్స్ ఆధారంగా అతను జైలులో ఖైదీగా కనిపించవచ్చని ప్రేక్షకులు అంచనా వేస్తున్నారు.

ఈ సినిమాను సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి నిర్మిస్తుండగా, రమ్య గున్నం సమర్పిస్తున్నారు. కాలభైరవ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యాసాగర్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.




# తీహార్ జైలుకు బాలీవుడ్ నటుడు రాజ్ పాల్ యాదవ్



బాలీవుడ్ నటుడు రాజ్ పాల్ యాదవ్ తీహార్ జైలు అధికారుల ముందు లొంగిపోయారు. చెక్ బౌన్స్ కేసులో ఢిల్లీ హైకోర్టు ఆయనకు జైలు శిక్ష విధించింది. ఈ నెల 2న సరెండర్ కావాలని ఆదేశించగా.. గడువు పెంచాలంటూ రాజ్ పాల్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు.. వెంటనే లొంగిపోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. తమ సంస్థ నుంచి తీసుకున్న రుణాన్ని చెల్లించేందుకు రాజ్ పాల్ యాదవ్, ఆయన భార్య ఇచ్చిన చెక్ బౌన్స్ అయిందంటూ మురళీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2018లో కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు.. రాజ్ పాల్ దంపతులను దోషులుగా తేల్చింది. రాజ్ పాల్ కు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దీనిపై నటుడు అప్పీల్ చేసుకోగా 2019లో సెషన్స్ కోర్టు కూడా ఈ శిక్షను సమర్థించింది. దీనిని సవాలు చేస్తూ రాజ్‌పాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. 2024 లో ఢిల్లీ హైకోర్టు రాజ్ పాల్ కు విధించిన జైలుశిక్షపై స్టే విధించింది. రాజీ కుదుర్చుకోవాలంటూ రాజ్ పాల్ కు సూచించగా.. మురళీ ప్రాజెక్ట్స్ కు డబ్బు చెల్లిస్తానని రాజ్ పాల్ కోర్టుకు హామీ ఇచ్చారు. అయితే, ఆయన మాట నిలబెట్టుకోలేకపోవడంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**